సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 12 । ఆగస్టు । 2023



ఆటకు అందలం
ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. -10లో



విద్య, ఆరోగ్యంపై సమదృష్టి
విద్యార్థులకు నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. -10లో



ఇద్దరు మోసగాళ్ల అరెస్ట్
పాత బంగారం తీసుకుని, కొత్తవస్తువులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. -10లో

న్యూస్‌రీల్

రాములోరి హుండీల ఆదాయం రూ.20.12 లక్షలు



దేవస్థానం ప్రాంగణంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవా భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థాన హుండీల ఆదాయాన్ని దేవస్థాన అధికారులు శుక్రవారం లెక్కించారు. మూడు నెలలకు దేవస్థానంలో ఉన్న అన్ని హుండీల ద్వారా రూ.20,12,436 ఆదాయం లభించిందని ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన శ్రీవారి సేవా భక్తులు, దేవస్థాన సిబ్బంది హుండీల ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు. జామి ఎల్లారమ్మ దేవాలయ ఈఓ ప్రసాదరావు పర్యవేక్షించారు.

14న మహిళల బైక్ ర్యాలీ

పార్వతీపురం: నానేల–నాదేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు శుక్రవారం తెలిపారు. 14న ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాల ఆవరణ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ ర్యాలీని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రారంభించి, పాల్గొంటారన్నారు. దేశభక్తి పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించనున్నామని ఆసక్తిగల మహిళలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యక్రమానికి వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. విద్యార్థులతో దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్, ఏఎంఓ పి.కోటిబాబు, డీఈలు ఢిల్లేశ్వరరావు, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: ఎటువంటి తప్పులు లేని ఓటర్ల జాబితాల రూపకల్పనే లక్ష్యంగా ముందుకు సాగాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ సూచించారు. వివిధ రాజకీయపార్టీల నాయకులు, బూత్ కన్వీనర్లు, బీఎల్‌ఓలు తదితరులతో సాలూరు పట్టణంలోని సీతారామ కళ్యాణ మండపంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు సమర్పించిన దరఖాస్తులన్నింటికీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఇంటి నంబర్ల సవరణకు ఫారం–8ను అందజేయాలన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల పరిశీలన



భద్రగిరి ఆశ్రమ పాఠశాలలో నాడు–నేడు పనులు పరిశీలిస్తున్న ప్రకాష్‌రావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, భద్రగిరి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్.కె.పాడు, తాటిశీల పాఠశాలల్లో నాడు–నేడు పథకం ఫేజ్ వన్, ఫేజ్ టు కింద చేపట్టిన పనులను రాష్ట్ర నాణ్యత, తనిఖీ అధికారి జి.ప్రకాష్ రావు శుక్రవారం పరిశీలించారు. నివేదికను సీఎం డాష్‌బోర్డుకు సమర్పిస్తామన్నారు. ఆయన వెంట ఎంఈఓ చంద్రశేఖర్, టీడబ్ల్యూ డీఈఈ సింహాచలం, ఏఈ అప్పారావు ఉన్నారు.

అక్కచెల్లెమ్మలకు
ఆర్థిక దన్ను



వైఎస్సార్ సున్నావడ్డీ నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- వైఎస్సార్ సున్నా వడ్డీ మహిళల ఖాతాల్లో జమ
- 2,34,256 లక్షల మందికి రూ.23.18 కోట్ల ఆర్థిక ప్రయోజనం
- సున్నా వడ్డీతో మహిళల్లో ఆర్థిక స్వావలంబన
- వ్యాపార నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి
- కలెక్టర్ కార్యాలయంలో నమూనా చెక్కును విడుదల చేసిన కలెక్టర్ నిషాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్:

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారు. ఆర్థిక దన్ను అందిస్తున్నారు. స్వయంఉపాధి పొందేందుకు, వివిధ వ్యాపారాల నిర్వహణకు చేయూతనందిస్తున్నారు. అందులో భాగంగానే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం వేదికగా మహిళా సంఘాలకు వైఎస్సార్ సున్నావడ్డీ నాలుగో ఏడాది నిధులను శుక్రవారం విడుదల చేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ నిషాంత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, వెలుగు ఏపీడీ సత్యం నాయుడు, లబ్ధిదారులు వర్చువల్ విధానంలో తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహకారంతో మహిళా సంఘ సభ్యులు వ్యాపార నైపుణ్యాలు మెరుగుపరచుకొని ఎక్కువ లాభాలను ఆర్జించాలని సూచించారు. జిల్లాలోని 20,223 పొదుపు సంఘాల్లోని 2,34,256 మంది మహిళకు రూ.23.18 కోట్ల ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. సంబంధిత చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. పొదుపు సంఘాల సభ్యులందరూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళలు నిర్వహిస్తున్న చిన్నతరహా వ్యాపారాలు మరింత లాభదాయకంగా, వడ్డీ భారం లేకుండా నడపడానికి, మెరుగైన జీవనం సాగించడానికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం దోహద పడుతుందన్నారు. వ్యాపార నైపుణ్యాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలోని పొదుపు సంఘాల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిన వైఎస్సార్ సున్నావడ్డీ నిధులు ఇలా..

విడతలు	పొదుపు సంఘాలు	లబ్ధిదారుల సంఖ్య	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి విడత	16,695	1,92,694	11.05
రెండవ విడత	18,868	2,15,165	10.66
మూడో విడత	20,223	2,30,676	13.68
నాలుగో విడత	20,223	2,34,256	23.18

స్వయం ఉపాధికి ఊతం



స్త్రీ నిధి నుంచి రూ.50వేలు, బ్యాంకు లింకేజీగా రూ.1 లక్ష, కేంద్ర ప్రభుత్వ పథకం నుంచి రూ.2లక్షలు రాయితీ రుణం తీసుకుని జెరాక్స్, ఫొటో స్టూడియో పెట్టుకున్నాను. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడంతో వడ్డీ రాయితీ అందుతోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద అందిన రాయితీ డబ్బులు వ్యాపార భివృద్ధికి దోహదపడుతున్నాయి.

– పెరుమాళ్ల సుజాత, చిదిమి గ్రామం, వీరఘట్టం మండలం

రూ.13,500 వడ్డీ మాఫీ



పొదుపు సంఘం తరఫున రూ.75 వేల రుణం తీసుకున్నాను. జెరాక్స్ మిషన్, చిన్నపాటి కిరాణాషాపు ఏర్పాటు చేసుకున్నాను. సకాలంలో రుణం చెల్లించడంతో వడ్డీ డబ్బులు సున్నా వడ్డీ పథకం కింద తిరిగిపొందాం. తనకు రూ.13,500 వడ్డీ మాఫీ వర్తించింది. మహిళలకు అన్నివిధాలుగా జగనన్న అండగా నిలుస్తున్నారు.

– ఆరిక శాంతకుమారి, పి.రేవిడి గ్రామం, కురుపాం మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



పొదుపు సంఘంలో రూ.50 వేలు రుణం పొందాను. నాటుకోళ్ల పెంపకం యూనిట్ నిర్వహిస్తున్నాను. నెలకు సుమారు రూ.5 వేలు సంపాదిస్తున్నా. రుణం, వడ్డీ సకాలంలో చెల్లించడం ద్వారా రూ.పదివేల వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ వర్తించింది. మహిళలకు వడ్డీభారం లేకుండా చేస్తున్న జగనన్న పదికాలాలు చల్లగా ఉండాలి.

– అల్లు రమాదేవి, లక్ష్మీనారాయణపురం గ్రామం, పార్వతీపురం మండలం

సీతకు అరుదైన అవకాశం

- ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర వేడుకలను వీక్షించేందుకు ఆహ్వానం



విజయనగరం ఫోర్ట్:

ఢిల్లీలోని ఎర్రకోటలో ఈ నెల 15న జరగనున్న స్వాతంత్య్ర వేడుకలను వీక్షించేందుకు చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన ఉపాధిహామీ వేతనదారు యందవ సీతకు ఆహ్వానం అందింది. దేశవ్యాప్తంగా 1800 మందికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానిస్తోంది. వీరిలో సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, రైతులు, నర్సులు, మత్స్యకారులు, కూలీలు తదితర వర్గాలకు చెందిన వారు ఉంటారు. ఉపాధిహామీ వేతనదారుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరికి అవకాశం లభించగా అందులో సీత ఒకరు. ఈ నెల 13వ తేదీన గన్నవరం నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లనున్నారు.

సంతోషంగా ఉంది

ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలు టీవీలో చూస్తేనే ఎంతో గొప్పగా ఉంటాయి. అలాంటి వేడుకలకు దగ్గరుండి వీక్షించేందుకు అవకాశం లభించడం ఆనందంగా ఉంది. మూడు రోజుల కిందట ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. ఆ తరువాత జిల్లా అధికారులు ఫోన్ చేశారు. ఈనెల 13న గన్నవరం నుంచి ఢిల్లీకి విమానంలో ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. జీవితంలో మరిచిపోలేని సంఘటన ఇది. డిగ్రీవరకు చదువుకున్నాను. డైట్ శిక్షణ కూడా పొందాను. గత ఏడాది డిసెంబర్ వరకు ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేశాను. ఆరోగ్య సమస్య తలెత్తడంతో మానేసి ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాను.

– యందవ సీత, రామలింగాపురం గ్రామం, చీపురుపల్లి మండలం

గర్వంగా ఉంది

ఉపాధి హామీ పథకంలో పనిచేసే వేతనదారురాలు ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను వీక్షించేందుకు ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవడం గర్వంగా ఉంది. ఉపాధిహామీ పనుల కల్పనలో విజయనగరం జిల్లా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

వేగవంతంగా మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి పనులు



మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం వేగవంతం చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురంలో నిర్మాణంలోఉన్న మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి భవనం పనులను, మ్యాప్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. రూ.49.26 కోట్ల వ్యయంతో ఆస్పత్రి పనులను ఏపీఎంఎస్ఐడీసీ ప్రారంభించిందన్నారు. వర్షాలు అధికంగా కురవకముందే ప్రాథమిక పనులు పూర్తిచేయాలని సూచించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో రూ.1.81కోట్ల వ్యయంతో చేపట్టిన ఆధునికీకరణ పనులు పరిశీలించారు.

వెయిటింగ్ రూమ్, ఐసీయూ తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.బి.వాగ్దేవి పనుల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డా.బి.జగన్నాథరావు, ఆర్‌బీఎస్‌కే పీఓ డా.డి.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

శివరాంపురం బ్రిడ్జి పనులకు
రూ.3 కోట్లు కేటాయించండి

సాలూరు: మండలంలో శివరాంపురం బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేందుకు అదనంగా రూ.3 కోట్లు కేటాయించాలని గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కేంద్ర సహాయకమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతిను అరకు ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. 2011లో ప్రారంభించిన శివరాంపురం బ్రిడ్జి పనులు నిధులు లేక నిలిచిపోయినట్టు తెలిపారు. బ్రిడ్జి ఆవశ్యకతను వివరించారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర విజ్ఞప్తిని తెలియజేశారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్టు ఎంపీ ఫోన్‌లో స్థానిక విలేకరులకు తెలిపారు.



కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతికు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ జి.మాధవి

13న 3కే రన్

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 27 వరకు విశాఖలో నిర్వహించనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్–2 క్రికెట్ లీగ్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విజ్జి స్టేడియం నుంచి కోట కూడలి వరకు ఈ నెల 13న 3కెరన్ నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, ప్రాథమికోన్నత, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుంగా చెల్లించి వచ్చే నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందించాలని సూచించారు.


ఈ ఏడాది డిసెంబర్ 3న పరీక్ష నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పూర్తి వివరాలకు 'బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోను, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తెలుసుకోవచ్చన్నారు.

మన్యం బడులకు
పురస్కారాల పంట

- పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు విద్యాలయాలు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపిక
- ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో ప్రథమస్థానం



సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల



రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపికైన భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్ (పీటీజీ)

సీతంపేట/గుమ్మలక్ష్మీపురం/వీరఘట్టం:

ఏజెన్సీలో అక్షర సేద్యం ఊపందుకుంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో సరస్వతీ నిలయాల్లో చదువుల యజ్ఞం నిర్విఘ్నంగా సాగుతోంది. నాడు–నేడు కింద ప్రభుత్వ బడుల కు ఆధునిక సొబగులు అద్దడం, చదువులకు అలవాలంగా తీర్చిదిద్దడం, పాఠశాలల పునఃప్రారంభం రోజునే జగనన్నవిద్యాకానుకలు అందించడం, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి వంటి పథకాలు అమలుచేయడం, ఎంఈఓలు, డీఈఓ, రాష్ట్రస్థాయి అధికారుల నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయులు చక్కని బోధన ప్రణాళికలు అమలు వంటివి సత్ఫలితాలిస్తున్నాయి. మన్యం విద్యార్థుల్లో అక్షర చైతన్యం కలిగిస్తున్నాయి. ఈ ఏడాది పదోతరగతి ఫలితాల్లో 87.47 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమస్థానంలో నిలిచి అందరి చూపును ఆకర్షించింది.

ఎనిమిదిలో నాలుగు మనవే...

ఈ నెల 15న విజయవాడలో నిర్వహించే స్వాతంత్య్ర దినోత్సవంలో పురస్కారాలు ప్రదానం చేసేందుకు రాష్ట్ర స్థాయిలో ఎనిమిది పాఠశాలలను ఎంపిక చేయగా, అందులో పార్వతీపురం మన్యం జిల్లాలోని పాఠశాలలే నాలుగు కావడం గమనార్హం. వీటిలో వీరఘట్టం మండలం రేగులపాడు కేజీబీవీ, సీతంపేట బాలికోన్నత పాఠశాల, జియ్యమ్మవలస జిల్లా పరిషత్ హైస్కూల్, గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల అధికారులకు సీఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. కొత్త జిల్లాగా ఏర్పడిన ఏడాదిలో చదువుల విప్లవం ఊపందుకోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పదో తరగతి ఫలితాల్లో ఫస్ట్

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల ఫలితాలు జిల్లాకు తలమానికంగా నిలిచాయి. మొత్తం 10,694 మంది విద్యార్థులు ఈ ఏడాది మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షలు రాయగా 9,356 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 7,865 మంది ప్రథమ, 1151 మంది ద్వితీయ, 340 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 587 మార్కులతో పాలకొండకు చెందిన పాడి హేమలత జిల్లా ఫస్ట్‌గా నిలిచింది. 585 మార్కులతో కురుపాంకు చెందిన కె.తనుశ్రీ, సాలూరుకు చెందిన కర్రి షర్మిలలు ద్వితీయ స్థానంలో నిలిచారు. గరిష్ట మార్కులు సాధించిన 24 మంది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాల అవార్డులను సొంతం చేసుకున్నారు.

గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల (పీటీజీ)లో చదువుతున్న విద్యార్థులు 2011 నుంచి 2023 వరకు వరుసగా పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. అత్యధికమంది బాలికలు 500 మందికి పైగా మార్కులు సాధించడం, ట్రిపుల్ ఐటీకీ ఎంపిక కావడంతో పాఠశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచింది. రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన సీతంపేట ప్రభుత్వ ఉన్న పాఠశాల నుంచి ఈ ఏడాది 51 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ పాసయ్యారు. 500లు పైబడి మార్కులు 20 మందికి వచ్చాయి. ట్రిపుల్ ఐటీకి ఐదుగురు, నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు మరో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. నాలుగేళ్లుగా శతశాతం ఫలితాలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 240 మంది విద్యార్థులు చదువుతున్నారు.

చక్కని బోధన



పాఠశాలలో చక్కని బోధన ప్రణాళికను అమలుచేస్తున్నాం. ప్రతీ విద్యార్థిని మెరికల్లా తీర్చిదిద్దుతున్నాం. అందుకే ఫలితాల్లో మేటిగా నిలుస్తున్నాం. ఉపాధ్యాయుల సమష్టి కృషికి అవార్డు రావడం ఆనందంగా ఉంది.

– వై.హేమసుందరరావు, హెచ్ఎం, సీతంపేట

ఉపాధ్యాయుల కృషి ఫలితం



సర్కారు బడులకు ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి హంగులు కల్పించింది. వసతులను సద్వినియోగం చేసుకుని విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు. అక్షర సేద్యంలో మేటిగా నిలిచి ముందుముందు మరిన్ని పురస్కారాలను సొంతం చేసుకోవాలి.

– ఎస్.ప్రేమ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, పార్వతీపురం మన్యం

సమష్టి కృషితోనే..



మా పాఠశాల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. మా పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల సమష్టి కృషికి గుర్తింపు లభించింది. పాఠశాల నుంచి 22 ఏళ్లుగా విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తుండగా 17 ఏళ్లు శతశాత ఉత్తీర్ణత నమోదైంది. బాలికల భవిష్యత్తుకు గట్టిపునాది వేస్తున్నాం.

– ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్, ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్ (పీటీజీ)

సంతోషకరం



కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు పాఠశాలలు రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల సమష్టి కృషి ఫలితానికి నిదర్శనం ఇది. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా కీర్తిని దేశ వ్యాప్తంగా చాటి చెప్పాలి.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

జగన్‌మామకు రుణపడి ఉంటాం



మారుమూలన ఉన్న మా పాఠశాలను అవార్డుకు ఎంపిక చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థులమంతా రుణపడి ఉంటాం. పాఠశాల ఉపాధ్యాయులు చక్కగా చదువు చెప్పడంతో టెన్త్‌క్లాస్‌లో 563 మార్కులు వచ్చాయి. ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సులో చేరాను. కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకుంటాను.

– సీహెచ్.సుష్మశ్రీ, విద్యార్థిని, సీతంపేట

ఆటకు అందలం


కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాల్లో శిక్షణ పొందుతున్న యువత

- 38 రోజుల పాటు 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరం
- 5 క్రీడాంశాలు..5 స్థాయిల్లో పోటీలు
- విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, బహుమతులు

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఇప్పటికే విద్యాభివృద్ధికి పెద్ద పీట వేసి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికి తీసేందుకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడాపోటీలు నిర్వహించడం ద్వారా ఆటలకూ పెద్ద పీట వేశారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు నుంచి ప్రారంభించే పోటీలకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేశారు. 38 రోజుల పాటు నిర్వహించే క్రీడా సంబరానికి జిల్లాస్థాయిలో సెట్విజ్ ఆధ్వర్యంలో జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి.

5 అంశాలు..5 స్థాయిల్లో పోటీలు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ టోర్నమెంట్‌లో 5 క్రీడాంశాల్లో..5 స్థాయిల్లో పోటీలు నిర్వహించనున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్‌బ్యాడ్మింటన్, క్రికెట్ క్రీడాంశాలకు సంబంధించి 17 సంవత్సరాల వయస్సు నిండిన క్రీడాకారులకు అవకాశం కల్పించనున్నారు. మొదటిగా క్షేత్ర స్థాయిలో సచివాలయ స్థాయిలో పోటీలు నిర్వహించనుండగా... అందులో విజేతలుగా నిలిచిన జట్లు మండల స్థాయిలో తలపడతాయి. అక్కడ విజేతలుగా నిలిచిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపించి పోటీలు నిర్వహిస్తారు. నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికవుతాయి. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభకనబరిచి సత్తా చాటిన జట్లను నవంబర్1 నుంచి 8వ తేదీ వరకు విశాఖ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

సెప్టెంబర్ 2 నుంచి ఎన్‌రోల్‌మెంట్‌కు అవకాశం

క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేందుకు యువతను ప్రోత్సహించడం, జీవన నాణ్యతను మెరుగుపర్చడానికి గల మార్గాలపై అవగాహన కల్పించాలనేది ఆడుదాం ఆంధ్రా ప్రధాన ఉద్దేశం. సచివాలయ స్థాయి నుంచి నిర్వహించే పోటీలకు సంబంధించి సెప్టెంబర్ 2 నుంచి ఆసక్తి గల క్రీడాకారుల వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభిస్తారు. క్రీడాకారులు ఆయా సచివాలయాల పరిధిలో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా విజయనగరం జిల్లాలో 626 సచివాలయాలు.. పార్వతీపురం-మన్యం జిల్లాలో 315 సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

విజేతలకు నగదు బహుమతులు

పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ విజేతలకు నియోజకవర్గ స్థాయిలో రూ.20వేలు, రూ.10వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ, జిల్లా స్థాయిలో రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేలను వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి అందజేస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ విజేతలకు రూ.లక్ష (ప్రథమ), రూ.50వేలు (ద్వితీయ), రూ.30వేలు (తృతీయ) బహుమతులు అందజేస్తారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కబడ్డీ, వాలీబాల్ , ఖోఖో, క్రికెట్ విజేతలకు రూ. 5 లక్షలు (ప్రథమ), రూ.3లక్షలు (ద్వితీయ), రూ.2లక్షలు (తృతీయ) నగదు బహుమతులు అందజేస్తారు.

యువతను ప్రోత్సహించడమే లక్ష్యం



యువతను క్రీడారంగంలో ప్రోత్సహించాలనే ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించారు. అక్టోబర్ 2 నుంచి ప్రారంభమయ్యే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సెప్టెంబర్2 నుంచి వివరాలను సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి. ఐదు క్రీడాంశాల్లో నిర్వహించే పోటీల్లో అర్హత, ఆసక్తి గల వారు పాల్గొనవచ్చు. – బి. రామ్‌గోపాల్, సీఈఓ, సెట్విజ్.

18న సాలూరులో ఉద్యోగ మేళా

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్


జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయికుమార్

పార్వతీపురం టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధికల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాలూరులోని గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈ నెల18న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఏదీ డిగ్రీ చదువుకుని వయస్సు 18నుంచి 30 సంవత్సరాల మధ్య గల నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళాకు రాజి-రామ్ ఎక్స్‌ట్రీమ్ సొల్యూషన్స్, ఐఐఎఫ్ఐఎల్ ఫైనాన్స్, హీరో, ఫ్లిప్‌కార్ట్, టీమ్‌లెస్, 2050 హెల్త్‌కేర్, ఆర్‌బీఐ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపికుంటారని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ,యువకులు వారి వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమె, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశంలో హాజరు కావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8555909899, 7993795796 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

దొంగతనం కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష

తెర్లాం: దొంగతనం కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ బొబ్బిలి పీజేసీజే కమ్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ ఎం.సరోజినమ్మ తీర్పు ఇచ్చినట్లు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని మెండి వీధికి చెందిన చంద్రశేఖరరావు(చిన్నపిల్లల డాక్టర్) ఇంట్లో 2019-20 సంవత్సరంలో కుమారరాజా అనే వ్యక్తి దొంగతనానికి పాల్పడి రూ.90వేలు నగదు అపహరించాడని అప్పట్లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేయగా విచారణ అనంతరం బొబ్బిలి కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించిందని చెప్పారు. ఈ కేసును ఏపీపీ నరేష్ వాదించారని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పాము మృతి


విద్యుత్ స్తంభంపై మృతిచెందిన పాము

పార్వతీపురం: పట్టణంలోని వైకేఎం కాలనీ సమీపంలో వసుంధర నగర్ వీధిలోగల విద్యుత్ స్తంభం ఎక్కిన ఓ పాము విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని స్థానికులు పేర్కొన్నారు. వర్షాలు కురవడంతో పాములు ఇతర విష జంతువులు వీధులలో సంచరిస్తున్నాయని చెబుతున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుబడిన పీడీఎస్ బియ్యం

సీతంపేట: మండలంలోని కొత్తగూడ సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టుకున్నారు. మొత్తం 47 బస్తాల (2300 కిలోలు) బియ్యం పట్టుబడ్డాయి. జామితోటకు చెదిన వ్యాపారి జామి సంతోష్ బియ్యాన్ని బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుండగా పట్టుబడ్డాడు. పట్టుబడిన బియ్యాన్ని పౌరసరఫరాల గొడౌన్‌కు అప్పగించినట్లు సీఎస్‌డీటీ మధుసూదనరావు తెలిపారు.

300 లీటర్ల సారా పట్టివేత


సారాతో పట్టుబడిన వారితో ఎస్సై ఎం.వి.రమణ, పోలీసు సిబ్బంది

వీరఘట్టం: ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆటోలో తరలిస్తున్న 300 లీటర్ల సారాను మండలంలోని తూడి గ్రామం సమీపంలో ఎస్సై ఎం.విరమణ, సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా సారా తరలిస్తున్న జె.అప్పారావు, సీహెచ్. చిన్నంనాయుడు, బి.కల్యాణ్‌బాబులను అదుపులోకి తీసుకుని ఆటో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


పాపారావు మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం గ్రామంలో మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఎస్సై నారాయణరావు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గరుగుబిల్లి పాపారావు(45) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో భార్య పది రోజుల కిందట కన్నవారింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన పాపారావు ఇంట్లో ఫ్యాన్‌హుక్‌కు ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై సమదృష్టి

- ఆహార కమిషన్ సభ్యులు
- పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటన


గరుగుబిల్లి గురుకుల పాఠశాలలో ఆహారపదార్థాలను రుచి చూస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు


విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరీక్షిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి, ఇందేల లక్ష్మీ రెడ్డి

పార్వతీపురం: నాణ్యమైన విద్య, మంచి ఆరోగ్యం అందించేందుకు సమాన దృష్టితో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి, ఇందేల లక్ష్మీ రెడ్డి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని గరుగుబిల్లి మండలంలో శుక్రవారం వారు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చౌకధరల డిపోలను తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకుల నిల్వల నమోదును రిజిస్టర్లలో పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం మెనూను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి పాఠ్యాంశాల పరిజ్ఞానాన్ని, ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరీక్షించారు. జగనన్న గోరుముద్ద పథకంలో వండిన వంటకాలు మెనూ ప్రకారం సక్రమంగా అందిస్తున్నదీ లేనిదీ తెలుసుకునేందుకు ఆహార పదార్థాలను రుచి చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల్లో పౌష్టికాహారం లోపం తలెత్తకుండా ఉండేలా బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తోందని చెప్పారు. అధికారులు ఉదాసీనత చూపకుండా పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డా.బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. అడిగిన ప్రశ్నలకు విద్యార్థినులు వెంటనే సరైన సమాధానాలు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

గరుగుబిల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆహార కమిషన్ సభ్యులు పరిశీలించి పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న రక్త పరీక్షల గురించి ప్రశ్నించగా 39 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, రక్తహీనత కలిగిన కేసులు ఏమైనా ఉన్నాయా అన్న విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కేతిరెడ్డి విజయ గౌరి, మధ్యాహ్న భోజన పథకం సహాయ సంచాలకుడు పి.దామోదరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి. గయాజుద్దీన్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఎస్.కృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. టి.జగన్‌మోహన్ రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎం.దేవ్లా నాయక్, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూఓ బి.సురేష్ కుమార్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి కె .ఆర్. రాజు, జిల్లా ఆహార భద్రత అధికారి వై. రామారావు, ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ పాత్రుడు, ఎస్.సంధ్యారాణి, సీహెచ్.శ్రీనివాస్ రావు, ఎస్‌పీహెచ్ఓ జోగిబాబు, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మోసగాళ్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సైలు భాస్కరరావు, అశోక్ కుమార్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: పాత బంగారం తీసుకుని, కొత్తవస్తువులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సైలు భాస్కరరావు, అశోక్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్ఎంకె జ్యూయలరీ షాపు యజమానులైన నాగులకొండ వెంకటకిశోర్, నాగులకొండ వెంకట శ్రీపాణిలు కొంతమంది కొనుగోలుదారుల నుంచి బంగారు వస్తువులు చేసేందుకు గాను పాత బంగారం తీసుకుని, కొత్తవస్తువులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు రెండు చీటింగ్ కేసులు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇటువంటి మోసాలు జరుగుతున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తుల గత చరిత్ర పరిశీలించి విలువైన వస్తువుల పట్ల జాగ్రత్త వహించాలని హితవు పలికారు.

భార్యను కొట్టిన భర్తకు రెండేళ్ల జైలు

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన కురమాన లావణ్యను తరచూ శారీరకంగా, మానసికంగా వేధిస్తూ ఇనుపరాడ్డుతో తలపైన కొట్టి గాయపరిచినట్లు నమోదైన కేసులో భర్త కుమార్‌కు రెండేళ్ల జైలుశిక్ష, జరిమానాను కోర్టు విధించినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ భర్త నిత్యం పెడుతున్న వేధింపులే కాకుండా తలపై కొట్టినట్లు లావణ్య ఇచ్చిన ఫిర్యాదుపై నిందితుడిని అరెస్టుచేసి బొబ్బిలి కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశామన్నారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో రెండు సంవత్సరాల జైలుశిక్ష, రూ.4వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

- వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్


మాట్లాడుతున్న వ్యవసాయసలహామండలి జిల్లా చైర్మన్ వి.నాగేశ్వరరావు

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అధిక ప్రాధాన్యం నిచ్చిందని వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వి.నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు పి.ఈశ్వరనారాయణ అధ్యక్షతన ఏఓ ఎస్ అవినాష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పంటలు సాగుచేస్తున్న రైతులకు విత్తనాల దగ్గరనుంచి ఎరువులు, క్రిమిసంహారక, కలుపు నివారణమందులు, వ్యవసాయ పరికరాలు, దమ్ముకు అవసరమైన యంత్రాలు రాయితీపై జగనన్న ప్రభుత్వం సమకూర్చిందన్నారు. రైతులు పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఏఓఎస్అవినాష్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ 830కు పైగా కౌలు రైతు కార్డులు మంజూరు చేశామని, ఇంకా ఎవరైనా రైతులు ఉంటే త్వరితగతిన సీసీఆర్‌సీ చేయించుకోవాలని ఆగస్టు 10 వరకు చేయించుకున్న కౌలు రైతు కార్డులు మాత్రమే రైతు భరోసా పథకానికి అర్హులని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఎంపీటీసీలు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, గ్రామసర్పంచ్‌లు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామానికి చెందిన బాలికను లైంగిక వేధింపులకు గురిచేయడంతో పాటు తనతో తీసుకుని వెళ్లిపోవడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్సై గంగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కషాయాల తయారీపై రైతులకు అవగాహన


కొత్తవలస: దెందేరు గ్రామంలో 10 రకాల ఆకులతో కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తవలస: మండలంలోని దెందేరు గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సహకారంతో కషాయాల తయారీపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.శ్యామల ప్రకృతిలో దొరికే 10 రకాల ఆకులతో కషాయాల తయారీపై అవగాహన కల్పించారు.ఈ కషాయం వరి పంటలో వచ్చే అన్ని రకాల చీడపీడల నివారణకు ఉపయోగపడుతుందని ముఖ్యంగా వరిలో వచ్చే అగ్గితెగులు నివారణకు విశేషంగా పనిచేస్తుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఈ కషాయాలు తయారు చేసుకోవచ్చని చెప్పారు. అలాగే గోపేడ, మూత్రం, ఇంగువతో కూడా కషాయం తయారు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో ఆదాయం

లక్కవరపుకోట: మండలంలోని కళ్లేపల్లి గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో బహుళ పంటల సాగుతో రైతులకు 365 రోజులు ఆదాయం వచ్చే విధానంపై అవగాహన కల్పించారు. సబల సంస్థ టెక్నికల్ రిసోర్స్ పర్సన్ ఈశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్టప్రాంతాల్లో వరి సాగు చేసే పొలాల్లో ఒక వరసలో వరి, మరో వరసలో బెండ ఇలా పలు రకాల పంటలు సాగు చేయవచ్చని చెప్పారు. ఈ విధంగా చేయడం వల్ల అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే రైతులకు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేయడంపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ రమణ, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం చోరీ

విజయనగరం క్రైమ్: రింగురోడ్డు సమీపంలో హనుమాన్ టవర్స్‌లో నివాసం ఉంటున్న కొల్లూరు సీతారత్నం మెడలో బంగారం గొలుసులు లాక్కుని నిందితుడు పరారయ్యాడు. దీనికి సంబంధించి టూటౌన్ ఎస్సై షేక్‌శంకర్ శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు సెంటర్‌కు వచ్చిన ఆమె కొనుగోలు అనంతరం తిరిగి ఇంటికి వెళ్లి, మెట్లు ఎక్కుతుండగా రెడ్ షర్ట్ వేసుకుని, హెల్మెట్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న సుమారు ఐదు తులాల రెండు బంగారు గొలుసులు లాక్కుని పరారయ్యాడు. వెంటనే బాధితురాలి బంధువులు డయల్ 100కి సమాచారం అందించగా టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేజీహెచ్‌లో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయిందని తల్లిదండ్రుల ఆరోపణ
- శిశువు ఆరోగ్య పరిస్థితి బాలేదని ముందే చెప్పామంటున్న వైద్యులు
- విచారణకు ఆదేశించిన సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్


చనిపోయిన 8 రోజుల శిశువు

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఎనిమిది రోజుల శిశువు శుక్రవారం మృతి చెందింది. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమ పాప మృతి చెందిందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ.. వార్డు ఎదుట ఆందోళనకు దిగారు. శిశువు ఆరోగ్య పరిస్థితి బాగోలేదని ముందే చెప్పినట్టు వైద్యులు చెబుతున్నారు. దీనిపై విచారణ చేస్తామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. పాప మృతదేహన్ని తీసుకెళ్లడానికి వాహనం సమకూర్చడంతో వివాదం సద్దుమణిగింది. వివరాలివీ.. పాలకొండకు చెందిన ఎం.శిరీష్, చంద్రశేఖర్ దంపతులకు ఈ నెల 3న పాప జన్మించింది. పుట్టుకతో శిశువు ప్రేగు సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. పాలకొండ వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అప్పటికే పచ్చకామెర్లతో బాధపడుతున్న శిశువును ఈ నెల 5న కేజీహెచ్ పిల్లల వార్డుకు తీసుకొచ్చారు. 8న పిల్లల విభాగం వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించారు. అనంతరం వార్డులోని ఐసీయూకు తరలించారు. పచ్చకామెర్లంటూ తమ సంతకాలు తీసుకున్న తర్వాత శిశువు మృతిచెందినట్టు చెప్పారని తల్లిదండ్రులు ఆరోపించారు. అక్కడ వైద్యులు గానీ, ఇతర సిబ్బంది పట్టించుకోలేదని వాపోయారు. గతంలో బాబు పుట్టగా.. కేజీహెచ్‌లోనే మృతిచెందాడని రోగుల బంధువులు గుర్తు చేశారు. విషయం తెలుసుకున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ హుటాహుటిన వార్డుకు వెళ్లి పరిస్థితులపై ఆరా తీశారు. శిశువు మృతిపై కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. ఈ సంఘటనపై విచారణ కమిటీని నియమిస్తున్నట్టు తెలిపారు. అనంతరం మృతదేహన్ని తీసుకొని సొంత ఊరు వెళ్లడానికి వాహనం సమకూర్చారు.